
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల
జిల్లా వార్తలు

5★★

శుక్రవారం 9 ఫిబ్రవరి 2024

మొరం..దళారులకు వరం
● ఇష్టారాజ్యంగా గుట్టల తవ్వకాలు
8లో..

వ్యక్తి దారుణ హత్య
పాత కక్షలే కారణమని అనుమానాలు
7లో..

గుట్టుగా ముందస్తు సర్వేలు..

● లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల కసరత్తు
● సెగ్మెంట్ల వారీగా వివరాల సేకరణ
● మండలాలపై సర్వే ఏజెన్సీల దృష్టి



జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలు పూర్తయిన కొద్ది రోజులకే జిల్లాలో మళ్లీ ప్రధాన రాజకీయ పార్టీలు వివిధ సంస్థలతో విడతల వారీగా సర్వేలు చేయిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపి స్తున్న నేపథ్యంలో ఆయా పార్టీలు తమ అభ్యర్థులను బరిలో దింపేం దుకు కసరత్తు చేస్తున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర తెలం గాణలో త్రిముఖ పోటీ ఉంటుందని పార్టీలు భావిస్తున్నాయి. దీంతో విలక్షణ తీర్పులకు పేరొందిన నిజామాబాద్ పార్లమెంట్ ప్రాంతంలో ఓటర్ల మనోగతం తెలు సుకునేందుకు పార్టీలు సర్వే బాట పట్టాయి. నిజామాబాద్ లోక్‌సభ స్థా నం పరిధిలోని ఆయా శాసనసభ సెగ్మెంట్ల వారీగా కుల సమీకరణలు, ఇ తరత్రా ప్రభావితం చేయనున్న వర్గాలు, వివిధ అంశాల వారీగా అభిప్రా యాలు సేకరించేందుకు వరుసగా సర్వేలు చేయిస్తున్నాయి. ఏ పార్టీకి ఆ పార్టీ గుట్టుగా సర్వేలు చేయి స్తుండగా, మరో వైపు ఆశావహులు సైతం వేర్వేరుగా సర్వేలు చేయిం చుకుంటున్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సర్వేలు జోరుగా జరుగుతున్నాయి.

గెలుపే లక్ష్యంగా కసరత్తులు...

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు అన్ని పార్టీలకు సవాల్‌గా మారింది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అదే ఊపుతో ఎక్కువ సీట్లు సాధించు కోవడంలో భాగంగా నిజామాబాద్ పార్లమెంట్‌పై సైతం దృష్టి సారించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు నిర్వహించిన విధంగానే తమ ఏజెన్సీల ద్వారా సర్వే లను కొనసాగిస్తుంది. జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ ని యోజకవర్గాల్లో పలువురి వద్ద వివరాలను కాంగ్రెస్‌కు చెందిన ఏజెన్సీలు సేకరిస్తున్నాయి. కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలు సైతం తమ తమ ఏజెన్సీలు, తమ అనునాయులతో సర్వేలు నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల కు చెందిన పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీలకు చెందిన అధ్యాపకులు, హెడ్‌ల ఆధ్వ ర్యంలో సైతం సర్వేలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఏ వర్గం ప్రజలు ఎటు వైపు ఉన్నారో...

నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి లోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గాల్లో ప్రజలు ఏ వైపు ఉన్నారో... వారి నాడీని తెలు సుకునే ప్రయత్నం చేస్తున్నారు.

జిల్లాలో ప్రధానంగా ఏ సమస్యలు ఉన్నాయి.. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ అంశాలు కీలకంగా మారను న్నాయి...బీజేపీ ప్రకటించిన పసుపు బోర్డు ఎంతవరకు పనిచేయనుంది.. అయోధ్య రామ జన్మ భూమి అంశం ఎన్నికల్లో కీలకంగా మారనుందా...అయోధ్యలో రాము ని విగ్రహం ఏర్పాటు అనంతరం మారిన పరిస్థితులు ఏమిటీ...ఏ పార్టీకి ఎలా మేలు చేస్తాయి అన్న తదితర అంశాల ను పరి శీలిస్తున్నారు. ఇవే కాకుండా గల్ఫ్‌కు వెళ్లిన కు టుం బాల సభ్యులు ఏ పార్టీకి మొగ్గు చూపుతారు.. కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు ఎటు మొగ్గు చూపుతున్నారు.. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం ఏ పార్టీపై ఎంత వరకు ప్రభావం చూపనుంది... ఫైనార్టీ ఓటర్లు పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించే వైఖరి ఎలా ఉండనుంది...యువత, మహిళల మొగ్గు ఎటు వైపు ఉండనుంది తదితర వివరాలు సేకరిస్తున్నారు.

కేంద్ర, రాష్ట్ర పథకాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రభావం ఎంత...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, ఇతర వర్గాలకు చెందిన ప్రజల కోసం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు ప్రభావం చూపుతాయా తది తర అంశాలను సర్వేలో పరిశీలిస్తున్నారు. కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆయా మండలా ల పరిధిలో వివిధ వర్గాల వారీగా వివరాలను సేకరిస్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఏజెన్సీలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన నిఘా ఏజెన్సీలు సైతం ఆయా ప్రాంతాల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నాయి. నియోజకవర్గాల్లో సేకరిస్తున్న వివరాలను తమ శాఖల ఉన్నతాధికారులకు నివేది స్తున్నారు. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు సైతం సొంతంగా సర్వేలు చేయించుకుంటూ గెలుపు ఓటములపై అంచ నాలు వేసుకుంటున్నారు.

పెరుగుతున్న ఆశావహులు..

ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ లలో పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. బీ ఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత పోటీ చేయనున్నారన్న ప్రచారం ఉంది. కాగా బీఆర్ఎస్ తరపున నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి కల్వకుంట్ల కవిత పోటీ చేయని పక్షంలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా పోటీ చేస్తారనే చర్చ నడుస్తోంది. లేనిపక్షంలో బీసీ కోటాలో మాస్ లీడర్‌గా పేరొందిన మాజీ ఎమ్మెల్యే ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజి రెడ్డిని బీఆర్ఎస్ నాయకత్వం బరిలోకి దింపనున్నట్లు తెలుస్తోంది. అయితే బీఆర్ఎస్ టికెట్‌ను ఇండియ న్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బీఎన్ రావు సైతం ఆశిస్తు న్నారు. రాష్ట్రంలో అధికార పార్టీగా కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ సైతం నిజామాబాద్ స్థానంలో సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ నేపథ్యంలో దీటైన అభ్యర్థిని బరిలోకి దించేం దుకు గట్టిగానే కసరత్తులు చేస్తోంది. ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పేరు ప్రధానంగా వినిపిస్తు న్నప్పటికీ మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యా ల సునీల్‌రెడ్డి, నిజామాబాద్ డీ సీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, విప్ ఈరవత్రి అనిల్, సినీ నిర్మాత దిల్‌రాజు, కాటిపల్లి వికాస్ రెడ్డి, నరాల కల్యాణ్ పేర్లు సైతం చర్చ ల్లోకి వస్తున్నాయి. బీజేపీ తరపున సెట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కే టికెట్ ఖాయంగా ఉన్నప్పటికీ ఆదిలాబాద్ పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జి అల్లాపు రం శ్రీనివాస్ నిజామాబాద్ నుంచి పోటీ చేయ డానికి ఆసక్తి చూపుతున్నారన్న ప్రచారం ఉంది. దీనికి తోడు నిజామాబాద్ బీజేపీ జిల్లా నాయ కులు బసవ లక్ష్మీ నారాయణ, ఇతరుల పేర్లు సైతం చర్చల్లోకి వస్తున్నాయి.

రెగ్యులర్ డీఈవోలను నియమించాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఎస్టీయూ జిల్లా శాఖ వినతి



జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సంఘ బాధ్యులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 8: విద్యాశాఖలో పర్యవేక్షణ కొరవడి నందున రెగ్యులర్ డీఈవో, ఎం ఈవోలను నియమించాలని కోరు తూ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) జిల్లా శాఖ బాధ్యులు బుధవారం రాత్రి వినతిపత్రం స మర్పించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడిచిన ఈ రాష్ట్రంలో 26 జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు లేర ని, 590 మండలాలకు రెగ్యులర్ ఎంఈవోలు లేరన్నారు. హెడ్మాస్టర్‌లే అదనపు బాధ్యతలతో ఎంఈవోలుగా వి ధులు నిర్వహిస్తున్నందున వారు ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రతి విద్యా ర్థికి పునాదిలాంటి ప్రాథమిక విద్యాభ్యాసం బలోపేతానికి తరగతికి ఒక ఉపా ధ్యాయున్ని నియమించాలని, అందులో ప్రత్యేకించి గణితం, తెలుగు, ఆంగ్లం, పీఈటీ బోధకులు ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. టెట్ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవచూపడంతో పాటు, నిలిచి పోయిన పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేసి, ఖాళీ పోస్టులు భర్తీ చేసేలా ప్రభుత్వం దృష్టికి సమస్యల ను తీసుకెళ్లాలని కోరినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలకు ఒక స్కావెంజర్ ఉం డేలా చూడాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినట్లు సంఘ జిల్లా అధ్యక్ష, కార్యద ర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి

మంత్రి ఉత్తమ్‌ను కోరిన కోరుట్ల ఎమ్మెల్యే



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 8 : నియోజక వర్గంలోని అభివృద్ధి పనులకు స్పెష ల్ డెవలప్మెంట్ ఫండ్స్ నిధులు మం జూరు చేసి కోరుట్ల నియోజకవర్గ అ భివృద్ధికి సహకరించాలని మంత్రు లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృ ష్ణారావు, ఓఎస్‌డీ వేముల శ్రీనివా స్‌లను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వ కుంట్ల సంజయ్ కోరారు. గురువారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివా లయంలో మంత్రులను కలిసి వారికి పుష్ప గుచ్ఛం అందజేసి నియోజక వ ర్గంలోని అభివృద్ధి పనులను వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా నిలిచిన వాటికి నిధులు మం జూరు చేసి పనులు కొనసాగించేలా చూడాలని, కోరుట్ల పట్టణంలోని బుర్జు చుట్టూ నూతన ఇళ్ల నిర్మాణానికి పురావస్తు శాఖ ఆదేశాలతో అనుమతి ఇవ్వ డం లేదని, వారు తీసుకున్న నిర్ణయాలను రద్దు చేసి నిర్మాణాలకు అనుమ తులు ఇవ్వాలని మంత్రులను కోరినట్లు ఆయన తెలిపారు. సీఎం ఓఎస్‌డీ వే ముల శ్రీనివాస్‌ను కలిసి నియోజక వర్గంలోని ఆర్థిక ఇబ్బందులతో చికిత్స చే యించుకోవడానికి ఎల్‌వోసీ, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పెండింగ్ లో ఉన్న వాటితో పాటు నూతనంగా దరఖాస్తులు చేసుకునే వారికి అందజే యాలని, పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు గురించి వారికి వివ రించినట్లు తెలిపారు.

అందుబాటులో ఇసుక పాయింట్లు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8 : గృహ నిర్మాణ అవసరాలతో పాటు వాణిజ్య అవసరాలకు కావలిసిన ఇసుక పాయింట్‌లను జిల్లాలో అందుబాటులోకి తె చ్చినట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ గురువారం ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై పూర్తి వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఇసుక వాహనం అమలును జిల్లాలో పక్కగా అమలు చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఆరు మండలాల్లో రీచ్‌లు అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ధర్మపురి మండ లంలోని రాజారాం, ఆరెపల్లి, కోరుట్ల మండలంలోని పైడిమడుగు, రాయికల్ మండలంలోని ఇటిక్యాల, జగన్నాథ్ పూర్, మల్లాపూర్ మండలంలోని సాతా రం, మెట్‌పెల్లి మండలంలోని ఆత్మకూర్, కథలాపూర్ మండలంలోని తక్కళ్లపె ల్లి గ్రామాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు ఆన్ లైన్ వెబ్‌సైట్, గుగూల్ ప్లే స్టోర్ నుంచి మన ఇసుక వాహనం అనే మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని బుక్ చేసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం ఇ సుక రావాణా చేయాల్సిన దూరాన్ని బట్టి ధర నిర్ణయిస్తుందన్నారు. ఇసుక స మాచారం కోసం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో ఉన్న94900 53631, 94416 70065 నెంబర్లతో పాటు స్థానిక తహసీల్దార్లను సంప్రదించవచ్చునని కలెక్టర్ వివరించారు.

గృహజ్యోతి పథకం దరఖాస్తులపై సర్వే

కథలాపూర్, ఫిబ్రవరి 8 : ఇటీవల ప్రభుత్వం ప్రజల నుంచి గృహజ్యోతి పథకం కింద స్వీకరించిన దరఖాస్తులపై గ్రామాల్లో అధికారులతో సర్వే కొన సాగించనున్నట్టు ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. మండలంలోని 19 గ్రామాల్లో సుమారు 10 వేల దరఖాస్తులు రాగా 6 వేల దరఖాస్తుల్లో సరైన సమాచా రం అందించని కారణంగా సర్వే చేసి నివేదిక అందిస్తామని పేర్కొన్నారు.

'సెర్ప్ కార్యక్రమాలు విజయవంతం చేయాలి'

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 8 : సెర్ప్ కార్యక్రమాలను టార్గెట్ ప్రకారం విజ యవంతంగా పూర్తి చేయాలని జిల్లా సెర్ప్ ఫైనాన్స్ అధికారిణి విజయ భార తి అన్నారు. జగిత్యాల మండల సెర్ప్ కార్యాలయంలో జగిత్యాలరూరల్, అర్బ న్ మండలాల సెర్ప్ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా విజయభారతి మాట్లాడుతూ బ్యాంక్ లింకేజీ టార్గెట్ ప్రకారం పూ ర్తి చేయాలని సూచించారు. ఎన్‌పీఏలు లేకుండా గ్రౌండిగ్ పూర్తి చేయాలని, సీహెచ్‌సీ సెంటర్ సక్రమంగా నడిపించాలన్నారు. ఆడిట్ కోసం అన్ని రికార్డు లు సిద్ధం చేసి ఉంచాలని ఆదేశించారు. గ్రామాల్లో జరిగే పారిశుధ్య కార్యక్ర మాల్లో మహిళసంఘాల సభ్యులు భాగస్వామ్యులు కావాలని కోరారు. ఈకా ర్యక్రమంలో జిల్లా సెర్ప్ మార్కెటింగ్ అధికారి మల్లేశం, ఏపీఎం ఓదెల గంగా ధర్, సీసీలు గంగారాం, రవీందర్, శ్రీనివాస్, విద్యాసాగర్, సిబ్బంది పద్మ, సురేందర్, అశోక్, పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నేడు టెండర్లు

బీర్‌పూర్, ఫిబ్రవరి 8: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి జాతర బ్రహ్మో త్సవాలు ఈ నెల 19 నుంచి మార్చి నెల 2వ తేది వరకు వైభవంగా ప్రా రంభం కానున్నాయి. ఈ జాతర బ్రహ్మోత్సవాలలో ఆయా వ్యాపారులు సా మగ్రి విక్రయాలకోసం శుక్రవారం ఉదయం 9గంటలకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఆవరణలో గుట్టపై టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తి గల వారు ఉదయం 9గంటలకు వచ్చి నేరు గా డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొని టెండర్లు దక్కించు కోవచ్చని తెలిపారు.

ఎంపీ అర్వింద్‌పై ఆరోపణలు అర్థరహితం

● దిష్టిబొమ్మ దహనంపై పార్టీ చర్యలు తీసుకోవాలి
● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 8: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్విం ద్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ, పార్టీ ప్రతిష్ఠతను దెబ్బతీసేలా ఎం పీ దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి భూమి రమణ రాష్ట్ర పార్టీ నాయకత్వా నికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని స్థానిక బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీజేపీ పోటీ చేసి నప్పుడు నాలుగు వేలు కూడా దాటని ఓట్లు, ఎంపీ అర్వింద్ చొరవతో ఇటీవల జరిగిన ఎన్నికల్లో నలభై వేలకు పెరిగిన విషయాన్ని గుర్తించాలన్నా రు. ఎంపీగా గెలిచాక పార్లమెంట్ పరిధిలో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ కన బర్చుతున్నారని, పసుపు బోర్డు ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ చూపి ప్రధాని నరేంద్రమోదీతో నిజామాబాద్ వేదికగా ప్రకటన చేయించిన ఘనత అర్వింద్‌కే దక్కిందన్నారు. పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తూ, పా ర్టీలైన్ దాటి, పర్సనల్ ఎజెండాతో ముందుకు సాగుతున్న కొందరు నా యకులు ఎంపీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారిపై పార్టీ అధిష్టానికి ఫిర్యాదు చేస్తామన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో సైతం తిరిగి భారీ మెజార్టీతో అర్వింద్ గెలవడం ఖాయమన్నారు. పా ర్టీకి మచ్చతెచ్చేలా, పార్టీ ఎంపీని అవమానించేలా వ్యవహరిస్తే ఊరు కోబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా వారి ఆలోచన ధోరణి మార్చుకో వాలని హితవుపలికారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా బాధ్యులు సుంకేటి దశరథరెడ్డి, రెంటం జగదీష్, సాంబారి కళావతి, నలువాల తి రుపతి, జుంబర్తి దివాకర్, బెజ్జారపు ప్రవీణ్‌కుమార్, బొడ్డు పెద్ద గం గారాం, ఇట్నేని రమేష్, పవన్‌సింగ్ తదితరులున్నారు.

వైభవంగా సీతా రాముల కల్యాణం

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8 : అయోధ్య బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పుర స్కరించుకుని లోక కళ్యాణార్థం జగదాలయ ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వాసవి గార్డెన్ నిర్వహిస్తున్న అఖండ హనుమాన్ చాలీసా పారాయణం మూడవ రోజు గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్ర మాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక కార్యక్ర మాన్ని నిర్వహించగా వేలాది మంది భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భారతీ తీర్థ పురస్కార గ్రహీత బాచంపెల్లి సంతోష్ కుమార్ శాస్త్రీ, వేద పండితుడు నంబి వేణుగోపాల చార్య కౌశికలు హాజరై భక్తులకు ప్రవచనా లు వినిపించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోళి శ్రీనివాస్, నాయకులు గాజుల రాజేందర్, నిర్వాహకులు కోటగిరి శ్రవణ్ కుమార్, చెట్ల చం ద్రశేఖర్, మార కైలాసం, బోనగిరి రామనారాయణ, తపుటు రాంచంద్రం, గుండేటి రాజు ఉన్నారు.

బహిరంగ వేలం పాట వాయిదా

ధర్మపురి, ఫిబ్రవరి 8: ధర్మపురి పురపాలక సంఘం పరి ధిలో ఈ నెల 13 న నిర్వహించే శనివారం వార సంత, వా హన పార్కింగ్, మేకల మండి (విక్రయించే మేకలు, గొర్రె లు), రోజు వారి మార్కెట్ బహిరంగ వేలం పాటు వాయి దా వేసినట్లు మున్సిపల్ కమీషనర్ సీహెచ్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా నిర్వహించే విధంగా 2024-25 వ సంవత్సరానికి గాను ఈ నెల 13న బహిరంగ వేలం పా ట కోసం తేదీ నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్ర భు త్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదే శా ల మేరకు బహిరంగ వేలం పాట వాయిదా వేసినట్లు ఆ యన వివరించారు. తిరిగి బహిరంగ వేలం పాట నిర్వ హించే తేదీ త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వెల్గటూర్, ఫిబ్రవరి 8: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ శేఖర్ సూచిం చారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం వెల్గటూర్ గ్రామ పంచాయితీ కార్యా లయం ఆవరణలో గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగిం చారు. అనంతరం మాజీ సర్పంచ్ మేరుగు మురళి ఆధ్వ ర్యంలో తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి గుండాటి సందీ ప్‌రెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రావు, ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేష్, గుమ్ముల అజయ్, రేగుంట నర్సయ్య పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనలో బీఆర్ఎస్ విఫలం

కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయ లక్ష్మి

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 8 :నూకపల్లి అర్బన్ హౌసింగ్ కాలనీలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మాత్రమే పట్టాలు పంపిణీ చేసి మౌలిక వసతుల కల్పనలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జి ల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇంధి రా భవన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగిత్యాలలోని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానమే ఇపు డు నూకపెల్లి హౌజింగ్ కాలనీ అని పేర్కొన్నారు. ధరూర్ క్యాంపులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి స్థలం కేటాయించుకుని నిర్మాణం చేపట్టిన గత ప్రభుత్వం పాత్రికేయులకు ఎందుకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. ఈ సమావేశంలో పీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ అధ్యక్షుడు కొత్త మోహన్, నాయకులు గాజుల రాజేందర్, కల్లెప ల్లి దుర్గయ్య, గుంటి జగదీశ్వర్, పుప్పాల అశోక్, నేహాల్, రాధకిషన్ రావు, దేవేందర్ రెడ్డి, పిప్పరి అనిత ఉన్నారు.

ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి..

నూకపెల్లి అర్బన్ హౌసింగ్ ఇళ్ల నిర్మాణ విషయంలో ఎమ్మెల్యే సంజయ్ కు మార్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హితవు పలికా రు. గురువారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హైదరాబాద్ నుంచి పత్యేక లేఖను విడు దల చేశారు. ధరూర్ క్యాంపులో ఆనాడు ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఇప్పుడు ఉ న్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయాలు ఎక్కడ నిర్మించేవారో ఎమ్మెల్యే స మాధానం చెప్పాలన్నారు. ఆనాడు నూకపల్లిలో స్థలం సేకరించకపోతే నేడు ని రుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం ప్రశ్నార్థకంగానే మారేదన్నారు.

జిల్లా ఓటర్లు 7,08,481

● పురుషులు 3,40,448, స్త్రీలు 3,67,998, ఇతరులు 35
● తుది ఓటరు జాబితాను విడుదల చేసిన కలెక్టర్



తుది ఓటరు జాబితాను విడుదల చేస్తున్న కలెక్టర్

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,08,481 ఓటర్లున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా తుది జాబితాను ప్రకటించారు. గురువారం రాత్రి పట్ట ణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో పలు రాజకీయ పక్షాల నాయకులకు తుది ఓటరు జాబితాను అందించారు. జిల్లాలో 7,08,481 మొత్తం ఓటర్లకు గాను పురుషులు 3,40,448 మంది, స్త్రీలు 3,67,998 మంది, ఇతరులు 35 మంది ఉన్నట్లు ప్రకటించారు. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 2,44,099 మొత్తం ఓటర్లకు గానూ పురుషులు 1,15, 932 మంది, స్త్రీలు 1,29,153 మంది, ఇతరులు నలుగురు, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 2,34,777 మొత్తం ఓటర్లకు గానూ పురు షులు 1,12,554 మంది, స్త్రీలు 1,22,198 మంది, ఇతరులు 25 మంది, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో 2,29,815 మొత్తం ఓటర్లకు గానూ పురుషులు 1,11,962 మంది, స్త్రీలు 1,17,847 మంది, ఇతరులు ఆరుగు రు ఉన్నట్లుగా తుది జాబితాను ప్రకటించారు. జిల్లాలోని మూడు అ సెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 224 మంది సర్వీసు ఓటర్లుండగా ఇందులో 220 మంది పురుషులు, నలుగురు స్త్రీలున్నట్లుగా తెలిపారు. సంబంధిత తుది జాబితాను ప్రధాన రాజకీయ పక్షాల ప్రతినిధులకు అందించారు. ఈకార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, పలువురు రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు, కోళ్లు మృతి



మృతి చెందిన మేకలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 8: తంగళ్లపల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో మేకలు, కోళ్లు మృతి చెందాయి. గురువారం తంగళ్లపల్లికి చెందిన పరకపల్లి తిరుపతికి చెందిన మేకల షెడ్‌పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆరు గొర్రెలు, 20 కోళ్లు మృతి చెందాయి. బాధిత తిరుపతి కుటుంబాన్ని ఎంపీపీ పడి గెల మానస రాజు, ఎంపీటీసీ కోడి అంతయ్య పరామర్శించారు. బాధితుడికి ఎంపీటీసీ అంతయ్య రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ దృష్టికి విషయాన్ని తీసు కెళ్లి బాధిత కుటుంబానికి సాయం అందేలా చూస్తామన్నారు.

ప్రమాదవశాత్తూ బావిలో పడిన యువకుడు

- మృతదేహం కోసం గాలింపు

శంకరపట్నం, ఫిబ్రవరి 8:మండలంలోని కరీంపేటలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ప్రత్యేక సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మహ్మద్‌గౌస్ (30) అనే యువకుడు గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఊరికి సమీపంలో గల ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావిలో జారిపడే సమయంలో సమీపంలో ఉన్న ఓ రైతు ప్రత్యక్షంగా చూసినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో బావిలో గాలింపు చర్యలు చేపట్టారు. నీరు ఎక్కువగా ఉండడంతో ఆచూకీ లభించలేదు. చీకటి పడడంతో గాలింపు నిలిపివేశారు.

దొంగ అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 : ఇటీవల నగరంలోని పలు చోట్ల ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న జయ శంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన రౌతు పవన్‌ను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. పవన్ వద్ద ట్యాబ్, 2 సెల్‌ఫోన్లు, 9 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



వాసవీమాత ఆలయంలో పూజలు

మల్లాపూర్, ఫిబ్రవరి, 8 : మల్లాపూర్ వాసవి మాత ఆలయంలో అమ్మ వారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని నిర్వాహకులు గురువారం ఘనంగా జరిపారు. ఉదయం నుంచి ఆర్యవైశ్యులు, భక్తులు ఆలయంలోని అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి మొక్కులు చెల్లించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా హల్దిపు పీఠాధిపతి శ్రీవామా నాశ్రమ మహాస్వామిజీ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి, భక్తుల ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండ లాధ్యక్షుడు చౌడారపు శ్రీనివాస్, మైలారపు లింబాద్రి, శివ రాంకిషన్, శివ శ్రీనివాస్, గాదె మనోహర్, సంగేమ్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజు సెలవు ప్రకటించాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 8: సంత్ సేవాలాల్ మహాజన్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని లంబాడీల ఐక్య వేదిక(లైవ్) అధ్యక్షుడు భూక్య నరేష్‌నాయక్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా దాదాపు మూడు కోట్లు, రాష్ట్రంలో దాదాపు 35లక్ష మంది గిరిజను లు(లంబాడీలు)ఉన్నారన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి దర్శనా నికి వచ్చే వారిలో ఎక్కువ శాతం గిరిజనులు ఉంటారని, వారికి ఇబ్బం దులు కలగకుండా సదు పాయాలు కల్పించాలని, పాలక వర్గంలో గిరిజ నులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మోహన్ నాయక్, రమేష్‌నాయక్, రాజేష్‌నాయక్, గంగాధర్‌నాయక్, నవీన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సీనియర్ కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను ఈనెల 10న నిర్వహిం చనున్నారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో మహిళలు, పురుషుల విభాగంలో ఈ పోటీలను సాయంత్రం 4 గంటల నుంచి నిర్వహించనున్నామని జిల్లా అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, కార్యదర్శి సిహెచ్ సంపత్‌రావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 25 కిలోల లోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీ లలో ప్రతిభ చాటే క్రీడాకారు లను మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు.

ఇల్లందకుంట ఆలయంలో వేలం పాటలు

ఇల్లందకుంట, ఫిబ్రవరి 8: శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో కొబ్బరి కాయలు అమ్ముకొనుటకు, పోగు చేసుకొనుటకు దేవాదాయ శాఖ డివిజన్ పరిశీ లకులు సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలం నిర్వహిం చారు. ఈ మేరకు పూజా సామగ్రి, కొబ్బరికాయలు ఒక సంవత్సరం పాటు అమ్ముకొనుటకు ఎనగంటి వెంకటేశ్వర్లు రూ.7,66,000 పాట, అదేవిధంగా కొబ్బరి ముక్కలు పోగు చేసుకొనుటకు క్యాతం రాజయ్య రూ.1,60,000 పాట పాడి టెండర్ దక్కించుకున్నారు. ఈ టెండర్ వీరికి ఒక సంవత్సరం ఉంటుందని ఆలయ ఈవో కందుల సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో మోహన్, రాజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో కానిస్టేబుల్ రిమాండ్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 8: భార్య స్రవంతి ఆత్మహత్య కేసులో సిరిసిల్ల పట్టణం సర్దాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుల్, భర్త రాగుల నాగరాజు అనే కానిస్టేబుల్‌ను అరెస్ట్‌చేసి గురువారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. ఇల్లందకుంట మండల కేంద్రానికి చెందిన నాగరాజు, స్రవంతి అలియాస్ లాస్య దంపతులు సిరిసిల్లలో ఉంటున్నారు. భార్య స్రవంతి మృతికి భర్త నాగరాజు, అత్తలే కారణమంటూ ఆమె తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో మృతురాలి అత్తను అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చిగురుమామిడి,ఫిబ్రవరి 8: మండలంలోని సుందరగిరి గ్రామానికి చెందిన కక్కర్ల లక్ష్మణ్(40) అనే గీత కార్మికుడు గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న లక్ష్మణ్‌ను తోటి గీత కార్మికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు గౌడ సంఘం నాయకులు తాళ్లపెల్లి రాజయ్య తెలిపారు. పేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,650 పలికిన పత్తి ధర

● జమ్మికుంట మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 8: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,650 పలికింది. గురువారం వ్యవసాయ మార్కెట్‌కు 88మంది రైతులు 770క్వింటాళ్ల విడి పత్తి, 10మంది రైతులు 19క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.6,650, కనిష్ఠ ధర రూ.5వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. శుక్ర, శని, ఆదివారాలు యార్డుకు సెలవు దినాలు, తిరిగి సోమవారం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి.

రేషన్ బియ్యం పట్టివేత

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని కందుగుల గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు టౌన్ సీఐ బొల్లం రమేష్ గురువారం తెలిపారు. పెట్రోలింగ్‌లో భాగంగా గ్రామ శివారులోని రైస్ మిల్‌లో సుమారు 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన అప్పని రమేష్, వెలగందుల ప్రకాష్, ఉప్పల్ గ్రామానికి చెందిన పోతిరెడ్డి శ్రీనివాస్ అనే వ్యక్తులు సదరు మిల్ యాజమానికి ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి విక్రయించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8: జన్మదిన వేడుకల సందర్భంగా రోడ్‌పై న్యూసెన్స్ చేస్తుండగా వారించిన వ్యక్తిపై బీరుసీసాతో దాడి చేసిన కేసులో ఆరుగురు యువకులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని రెండో ఠాణా పోలీసులు తెలిపారు. కార్ఖానగడ్డ గాంధీరోడ్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి 2:30 గంటలకు బర్త్‌డే వేడుకల సందర్భంగా యువకులు రోడ్డుపైకి వచ్చి న్యూసెన్స్ చేశారని, దీంతో స్థానికుడు గంభీరావుపేట్ పృథ్వీరాజ్ వారించగా వెంటనే యువకులు దాడి చేసి గాయపరిచారన్నారు. ఈ కేసులో కార్ఖనగడ్డకు చెందిన దసనం సాయి భరద్వాజ్, బొబ్బటి భరత్‌కుమార్, పెపకాయల సాయి మురళి, జగిత్యాల దోబివాడకు చెందిన బండ వరుణ్, మండ వర్ధన్, గాంధీనగర్‌కు చెందిన బొల్లారపు అభి అలియాస్ భరత్‌లను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ప్రయాణికురాలి బ్యాగు అప్పగింత

భగత్‌నగర్, ఫిబ్రవరి 8: బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగును ఆర్‌టీసీ అధికారులు ఆమెకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కొదురుపాకకు చెందిన ప్రయాణికురాలు భార్గవి ఈ నెల 7న ఆర్‌టీసీ బస్సులో బ్యాగు మర్చిపోయింది. డ్యూటీలో ఉన్న కండక్టర్ జె గంగాధర్, కానిస్టేబుల్ ఎండి అఫ్రోజోద్దిన్ ఆ బ్యాగును గుర్తించి అధికారులకు అప్పగించారు. తన బ్యాగు పోయిన విషయాన్ని ఆమె అధికారుల దృష్టికి తీసుకురాగా పూర్తి వివరాలను తెలుసుకొని ఆమె బ్యాగును ఆమెకు అందచేశారు. బ్యాగులో రూ.35000లు రెండు వేల రూపాయల విలువైన బట్టలు అందులో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఎర్నింగ్ డీసీ ఇబి రావు, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీరాజం, కంట్రోలర్ కె రవిందర్, కంటక్టర్ జె గంగాధర్ పాల్గొన్నారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 8: కులం పేరుతో దూషించడంతో పాటు చంపుతామని బెదిరించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. మండలంలోని గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని ప్రభుత్వ ఖాళీ స్థలంలో గత 8 ఏళ్లుగా టీకొట్టు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడని పేర్కొన్నారు. తన టీకొట్టు చుట్టూ రేకులు అమర్చుకోవడం కోసం బండరాళ్లను పేర్చుతుండగా ఇది మా స్థలం అంటూ నిందితులు బెదిరించారని తెలిపారు. అతనిపై దాడి చేయడంతో పాటు చంపుతామని బెదిరించాలని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

కత్తులతో విద్యార్థినులను బెదిరించిన యువకులు

ముస్తాబాద్, ఫిబ్రవరి 8: ముస్తాబాద్ మండల కేంద్రంలో విద్యార్థినులను యువకులు కత్తులతో బెదిరించిన సంఘటన గురువారం కలకలం రేపింది. విద్యార్థినుల తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదోతరగతి విద్యార్థినులు భోజన సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ముగ్గురు యువకులు బైక్ వచ్చి కత్తులతో బెదిరించారు. విద్యార్థినుల అరుపులు విని సమీపంలో ఉన్న కాలనీవాసులు బయటకు వచ్చారు. ఈలోగా బైక్‌పై ఉన్న యువకులు పారిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల సాయంతో యువకులను పట్టుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బీహార్ కూలీపై దాడి



కార్మికుడి ఒంటిపై గాయాలు

రామగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని లొంకకేసారం సాయిబ్రిక్స్ (ఎస్‌పిఐ) యాజమాని సోదరుడు ఒరిస్సా కూలీపై దాడి చేశాడు. ఇటుక బట్టీలో పనిచేసే బీహార్‌కు చెందిన చర్యా అనే కూలీపై సైండ్ల విష్ణు అనే యువకుడు గురువారం విచక్షణ రహితంగా కర్ర, చెప్పులతో దాడికి పాల్పడినట్లు కూలీ చర్యా పేర్కొన్నాడు. అర్ధరాత్రి వేళ కాలుతున్న బటీనుంచి ఇటుకలు లోడ్ చేయాలంటూ బెదిరింపులకు గురిచేశాడని తెలిపాడు. తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను తీసుకొని ఇష్టవచ్చినట్లు దూషించాడని కూలీ ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవిప్రసాద్ తెలిపారు.

ఆవాల పరిశోధనాస్థానం ఏర్పాటయ్యేనా?

● మూడేళ్లుగా కాగితాలకే పరిమితం ● శాస్త్రవేత్తలు, నిధులు లేక అన్నదాతల్లో నిరుత్సాహం



జగిత్యాల పొలాస ప్రాంతీయ పరిశోధన స్థానం



జగిత్యాల జిల్లాలో సాగవుతున్న ఆవాల పంట

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం ఆశపడుతున్న ఆవాల రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మూడు సంవత్సరాలుగా జగిత్యాల జిల్లా పొలాసలో ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమైంది. ఒక వైపు శాస్త్రవేత్తలు లేక...మరో వైపు నిధులు రాక ఆవాల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉత్తర తెలంగాణలో వ్యవసాయ పరిశోధనలకు కేంద్రమైన జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస పరిశోధన స్థానంలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తామని చెప్పి మూడేళ్లు గడుస్తున్నప్పటికీ అతీ, గతీ లేకుండా పోయింది. ఆవాల పరిశోధన స్థానం మంజూరులో జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. గతంలో వ్యవసాయ శాఖ మంత్రిగా వ్యవహరించిన నిరంజన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ ఇప్పటికీ మంజూరు కాలేదు. నిధులు కానీ, శాస్త్రవేత్తలను కానీ నియమించలేదు. దీంతో ఆవాల పరిశోధనా స్థానం అటకెక్కినట్లేనని రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఆవ సాగు ఉత్తర తెలంగాణలోనే అధికం

ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలో దాదాపు 30 వేల ఎకరాల్లో ఆవాల పంట సాగుచేస్తున్నారు. ఇక్కడి పొడి వాతావరణ పరిస్థితులు ఆవాల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. దీనికి తోడు సాగుకు అవసరమైన ఎర్ర నేలలు ఉండడం కూడా ఆవాల సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమవుతోంది. సాగునీటి వసతి ఉండడం, నాలుగైదు నీటి తడులు ఇస్తే సరిపోవడం, 80-90 రోజుల్లోనే పంట చేతికి వస్తుండడంతో రైతులు ఈ పంట సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ ప్రాంతాల్లో ప్రైవేటు కంపెనీలు ఆవాల సాగును విస్తృతంగా చేపడుతున్నాయి. పలు కంపెనీలు విత్తనోత్పత్తిని చేపట్టి, ఇతర రాష్ట్రాలకు విత్తనాలు సరఫరా చేస్తున్నాయి. రైతులు విత్తనోత్పత్తిలో సాగు చేస్తే క్వింటాలుకు రూ. 9 వేల వరకు ధర అందిస్తున్నారు. సాధారణ ఆవాలకు క్వింటాలుకు రూ.7-8 వేల వరకు ధర చెల్లిస్తుండడంతో ఎక్కువ మంది రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఆవాల పంటకు అడవి పందులు, పక్షులు, కోతుల బెడద లేకపోవడం, పంట ముందుగానే ఏ రేటు వస్తుందో రైతులకు తెలియడంతో ఎక్కువగా సాగుకు ముందుకు వస్తున్నారు. మంచి పంటవస్తే ఎకరాకు 6-8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఎకరాకు రూ.50వేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉంది. వరి, మొక్కజొన్నకు ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నప్పటికీ ఫలితం కనబడటం లేదు.

నివేదికలకే పరిమితం

నాలుగేళ్ల క్రితం ఉత్తర తెలంగాణ (పొలాస) పరిశోధన స్థానం పరిధిలో ఆవాల పంట సాగుచేసి, ఇక్కడి శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంతో పాటు జాతీయ వ్యవసాయ పరిశోధనా మండలికి నివేదికలు పంపారు. ఆవాల పరిశోధనా స్థానం ఏర్పాటు కోసం జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి సైతం సంతృప్తి వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వానికి సానుకూల నివేదికను పంపింది. కరోనా సమయంలో సంబంధిత ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. అనంతరం జరిగిన జాతీయ పరిశోధన మండలి సమావేశంలో పాల్గొన్న అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి తెలంగాణలోని పొలాసలో ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని సూచించినా ఇప్పటివరకు ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

గతంలోనే నివేదికలు పంపాము

- డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస



జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో అదనంగా ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటు చేయాలని గతంలోనే రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా జాతీయ వ్యవసాయ పరిశోధన మండలికి నివేదికను పంపాం. మండలి సైతం ఆవాల పరిశోధన స్థానం ఏర్పాటుకు సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. పరిశోధన స్థానం ఏర్పాటు చేస్తే ఉత్తర తెలంగాణ ఆవాల రైతులకు మేలు జరుగనుంది.

కొండగట్టు హుండీ ఆదాయం రూ.83.91 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, ఫిబ్రవరి 8: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని అధికారులు గురువారం లెక్కింపు చేపట్టారు. 28 రోజులకు హుండీల ద్వారా రూ.83,91,502 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 32 గ్రాముల మిశ్రమ బంగారం, 4.500కిలోల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో పి.వెంకటేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవాదాయశాఖ ఏసీ చంద్రశేఖర్, ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఎస్సై అశోక్, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి పాల్గొన్నారు. క్రితం సారి హుండీ లెక్కింపు సందర్భంగా సిబ్బంది సొమ్ములు తస్కరించిన నేపథ్యంలో మరోసారి అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ బందోబస్తు పెంచారు.

విద్యుత్ స్టార్టర్ల దహనం



ధర్మారంలో దహనమైన విద్యుత్ స్టార్టర్

కోనరావుపేట, ఫిబ్రవరి 8 : కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ బావి మోటరు స్టార్టర్లను దహనం చేశారు. ధర్మవరం గ్రామానికి చెందిన గంగుల మహేష్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి రెండు మోటారు స్టార్టర్లను దహనం చేశారు. దీంతో ఆ రైతుకు పది వేల రూపాయల వరకు నష్టం వాటిలినట్లు బాధిత రైతు తెలిపాడు.

వ్యక్తి దారుణ హత్య

● పాత కక్షలతోనే అని అనుమానాలు



వెంకటరమణ(ఫైల్)

కోరుట్ల, ఫిబ్రవరి 8: పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి హత్య ఘటన సంచలనం రేపింది. ద్విచక్రవాహనంపై వెలుతున్న వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో విచక్షణా రహితంగా దాడికి పాల్పడడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అయితే పాత కక్షలే హత్యకు కారణమని తెలుస్తోంది. కాలనీ వాసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల పట్టణంలోని గాంధీ రోడ్డుకు చెందిన అనుమాల్ల వెంకటరమణ (55) పట్టణంలో వడ్డీ వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వెంకటరమణ పట్టణంలోని అర్బన్ కాలనీలో ఓ ఇంటిని గెస్టు హౌస్‌గా ఏర్పరుచుకుని అక్కడి నుంచి వడ్డీ వ్యాపారంతో పాటు ప్రైవేట్ చిట్టీలను నడిపిస్తుండేవాడు. అదే కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ మధ్య ఓ విషయంలో మనస్పర్థలు రావడటంతో గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగి రాజీపడ్డారు. రఘు కొన్ని రోజులు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇటీవల తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి రఘు తన కాలనీ ప్రాంతంలోనే గణేష్ విగ్రహాల తయారీ కేంద్రంలో పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల వెంకటరమణ రఘు మధ్య మరో మారు గొడవలు తలెత్తాయి. ఈ క్రమంలో గురువారం సాయంత్రం యధావిధిగా వెంకటరమణ తన ద్విచక్ర వాహనంపై తన గెస్ట్ హౌస్‌కు వెలుతుండగా మాటు వేసిన రఘు వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణా రహితంగా దాడి చేయడంతో వెంకటరమణ పక్కనే ఉన్న మురికి కాలువలో పడిపోయాడు. అప్పటికీ ఆగకుండా రఘు తన వద్ద ఉన్న కత్తితో మళ్లీ దాడి చేయడంతో వెంకటరమణ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అక్కడి నుంచి నిందితుడు పరారయ్యాడు. గమనించిన కాలనీవాసులు పోలీసులకు సమాచారం అందించడంతో మెట్‌పల్లి డీఎస్పీ రవీంధర్ రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వివరాలు సేకరించి నిందితుడు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడు రాత్రి సమయంలో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

నష్టపరిహారం ఇచ్చి భవనాలను నిర్మించాలి

● మెడికల్ కళాశాల నిర్మాణ పనులు అడ్డుకున్నరైతులు



పనులు అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 8 : మా భూములకు నష్టపరిహారం ఇచ్చిన తర్వాత మెడికల్ కళాశాల అదనపు భవనాలను నిర్మించుకోవాలంటూ గురువారం నిర్మాణ పనులను రైతులు అడ్డుకున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని సర్వేనంబర్ 408లో ఉన్న భూములను గత ప్రభుత్వం మెడికల్ కళాశాలకు తీసుకుని భవనం నిర్మించారు. మిగిలిన భూముల్లో తిరిగి అదనపు భవనాలను నిర్మించేందుకు బుధవారం వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్‌లను రైతులు అడ్డుకోవడంతో పనులు నిలిపివేసి వెళ్లిపోయారు. గురువారం కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ఈఈ రవీందర్‌లు పెద్దూర్‌కు చెరుకుని ఎక్స్‌కావేటర్‌లతో భూములుల్లో పనులను చేపట్టగా ఈ విషయం తెలుసుకున్న 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రి బాలరాజుయాదవ్‌తోపాటు రైతులు అక్కడికి చేరుకుని పనులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వివాదానికి దిగారు. ఆందోళన చేయడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని రైతులను సముదాయించినా రైతులు మాత్రం మా భూములకు నష్టపరిహారం అందించిన తరువాతనే భవనాలను నిర్మించాలని పనులను నిలిపివేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం 408సర్వేనంబర్‌లో ఉన్న భూములను జీవనోపాధికోసం అందించగా వాటిలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తుండగా గత రెండు సంవత్సరాల క్రితం మా భూములను చదును చేసి 36 ఎకరాలల్లో మెడికల్ కళాశాల నిర్మాణాలను చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా పట్టించుకోలేదన్నారు. దీంతో మిగతా భూములను ఇవ్వవద్దని నిర్ణయించుకున్నామని తీసుకున్న భూములతో పాటు భూములకు నష్టపరిహారం అందిస్తేనే పనులు చేయిస్తామని లేకుంటే అడ్డుకుని అందోళనలు చేయడంతో పాటు నిరాహార దీక్ష చేపడుతామన్నారు. నష్టపరిహారం ఇచ్చిన తరువాతనే పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లింగంపల్లి అశోక్, నాగుల రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, గుగ్గిళ్ల అంజవ్వ, లింగంపల్లి రాజవ్వ, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎల్లంపల్లి గేట్‌వాల్వులు ధ్వంసం.. వృథాగా సాగునీరు



గోపాల్‌రావు పేట వద్ద వృథాగా పోతున్న నీరు

రామడుగు, ఫిబ్రవరి 8: అధికారుల అనుమతి లేకున్నా కొంతమంది ఎల్లంపల్లి పైపులైన్ గేట్ వాల్వులను ధ్వంసం చేయగా వృథాగా పంట పొలాల్లోకి నీరు రావడంతో పంటపొలాలు నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట, గుండి గ్రామాల మీదుగా గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి ఎల్లంపల్లి పైప్‌లైన్ ద్వారా నీరు వెళ్తుంది. అయితే వారం క్రితం ఎల్లంపల్లి నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌కు సంబంధిత అధికారులు నీటిని విడుదల చేశారు. కాగా ఎల్లంపల్లి పైప్‌లైన్‌కు గోపాల్‌రావుపేట, గుండి గ్రామాలలో సుమారు రెండు మూడు కిలోమీటర్లకు మూడు నుంచి నాలుగు గేట్ వాల్‌లను అమర్చారు. ఇదే అదునుగా చేసుకున్న కొంతమంది గోపాల్‌రావుపేటకు సమీపంలోని ఎల్లంపల్లి పైప్‌లైన్ మీద ఉన్న రెండు గేట్‌వాల్ ధ్వంసం చేయడంతో నీరంతా పైకి లేచింది. దీంతో దేశాయిపేట చెరువులోకి నీరు వెళ్లేందుకు ఏకంగా జేసీబీతో పైప్‌లైన్‌పై కాలువ తీసి గోపాల్‌రావుపేట రైతుల అనుమతి లేకుండా అక్రమంగా కాలువను తీశారని రైతులు వాపోతున్నారు. గేట్‌వాల్‌ల నుంచి వచ్చే నీరంతా రైతుల పంటపొలాల్లోకి వెళ్లడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎడవల్లి రామచంద్రారెడ్డి అనే రైతు పొలంలో తన అనుమతి లేకుండానే జేసీబితో కాలువను తవ్వి నీటిని చెరువులోకి తరలిస్తున్నారని అన్నారు. గేట్‌వాల్‌ను ధ్వంసం చేసి అక్రమంగా నీటిని తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేములవాడలో ఘనంగా మహాలింగార్చన



మహా లింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, ఫిబ్రవరి 8 : వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారికి గురువారం మహాలింగార్చన ఘనంగా నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఉదయం వేళలో స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం వేళలో స్వామివారి కల్యాణ మండపంలో మహాలింగార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా లింగాకారంలో అమర్చిన ప్రమిదలలో జ్యోతులు వెలిగించి పూజించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలో పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి8: మండలంలోని గంగారం గ్రామంలో పోలిసులు పెట్రోలింగ్ చేస్తుండగా 20 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం అక్రమంగా టాటా ఏఎస్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. గ్రామాల్లో ప్రజల నుంచి నేరుగా విక్రహించి మహారాష్ట్రకు తరలిస్తున్నట్టు గుర్తించినట్టు తెలిపారు. గంగారం గ్రామంలో నరహరి శంకర్‌రెడ్డి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 17 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకొని సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్‌కు అప్పగించినట్టు తెలిపారు.

ఎవరైనా పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలించినా నిల్వ ఉంచినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

సభలో ఉమ్మడి జిల్లా నేతలు





అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు సీఎంకు స్వాగతం పలుకుతున్న శాసనసభా వ్యవహారాల శాఖా మంత్రి శ్రీధర్‌బాబు, విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్







సమావేశాలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు జీవన్‌రెడ్డి, రమణ, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్, విజయరమణారావు

ధనార్జన మీద ఉన్న యావ ప్రజలపై లేదు

కాంగ్రెస్ పట్టణ నాయకులు

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మున్సిపాలిటీలో 15 రోజులుగా జరుగుతున్న పాలక మండలి తీరు ధనార్జనే ధ్యేయంగా కనిపిస్తుందని రాయికల్ పట్టణ కాంగ్రెస్ నాయకులు అన్నారు. రాయికల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ శాఖ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవిశ్వాస తీర్మానం పేరిట ధనార్జన కోసం వ్యవహరిస్తున్నారని, ప్రజలను పట్టించుకునేవారే కరువయ్యారని అన్నారు. నాలుగేళ్ల నుంచి కనబడని నిధుల కొరత ఇప్పుడు ఏర్పడి 25 మంది కార్మికులను తొలగించడం సరి కాదన్నారు. దీంతో పట్టణంలో పరిశుభ్రత లేక మురికికూపంగా మారిందన్నారు. తక్షణమే ఉపాధి కోల్పోయిన కార్మికులను విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలన్నారు. రాయికల్ పట్టణంలోని కాలనీలు మురికి కూ పంలా మారుతున్నాయని, అవి ఎక్కడికక్కడ దోమల బెడదతో ప్రజలు చికెన్ గున్యాలాంటి విష జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారని పేర్కొన్నారు. సం బంధిత అధికారులు, మున్సిపల్ పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకుం టే ప్రజల కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాపురపు నర్సయ్య, పడిగెల రవి, మున్నా, మహ్మద్ షాకీర్, రాకేష్ నాయక్, కొయ్యడి మహిపాల్, ఎద్దండి దివాకర్ పాల్గొన్నారు.

సూరమ్మ చెరువు పనుల్లో..

349 ఎకరాలకు నష్టపరిహారం

కథలాపూర్, ఫిబ్రవరి 8 : సూరమ్మ చెరువు కుడి, ఎడమ కాలువల నిర్మాణంలో 349 ఎకరాల రైతుల భూములు కోల్పోతున్నట్లు గుర్తించామని తహసీల్దార్ ముంతాజీబోద్దీన్ తెలిపారు. కొద్ది రోజులుగా అంబారిపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్, ఇప్పపల్లి, పోతారం, చింతకుంట గ్రామాల్లో తమ సిబ్బందితో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయించామన్నారు. కుడి కాలువలో 123 ఎకరాలు, ఎడమ కాలువలో 226 ఎకరాల భూములు కోల్పోతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించిన సర్వేల్లో ఎంతమంది రైతులు క్షేత్రస్థాయిలో సాగులో ఉన్నారు, ప్రస్తుతం ఆ రైతులు జీవించి ఉన్నారా అనే అంశాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నష్టపరిహారం విడుదల కాగానే రైతులకు అందజేసే ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ఐ నాగేశ్ ఉన్నారు.

విద్యా వైజ్ఞానిక మహాసభను విజయవంతం చేయాలి

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 8 : ఖమ్మం జిల్లాల్లో తెలంగాణ ప్రోగ్రాం సేవ్ టీచర్స్ ఫేడరేషన్ రెండవ విద్యా వైజ్ఞానిక మహా సభను విజయంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో లంచ్ సమయంలో టపీటీఎఫ్ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11, 12తేదీలలో నిర్వహించే మహాసభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. అంతరాలు లేని విద్య ప్రజల హక్కు. ప్రభుత్వ బాధ్యత దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించడానికే మహా సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు రవీందర్, రాజనర్సయ్య, వహీవొద్దిన్, రవి, మారుతి పాల్గొన్నారు.

లావాదేవీల కోసమే అవిశ్వాస తీర్మానం

బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి

రాయికల్, ఫిబ్రవరి 8: లావాదేవీల కోసమే బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం తెరపైకి తెచ్చారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి అన్నారు. రాయికల్ పట్టణంలోని జేఏసీ ప్రెస్ క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించి వాళ్ల నాయకులతో లావాదేవీలు జరుపుకున్నారన్నారు. గతంలో ప్రతిపక్ష కౌన్సిలర్లు హాజరై సమావేశ హాజరు పట్టికను వాడుకుని ఇష్టారీతిలో తీర్మానాలు చేసుకున్నారని అన్నారు. ఒకదానికొకటి పొంతన లేని తీర్మానాలు చేసి కొన్ని చోట్ల పనులు చేయక బిల్లులు తీసుకున్నారని ఆరోపించారు. చెత్త వాహనాలకు డీజిల్, పెట్రోల్ ఖర్చులకు లక్షలాది రూపాయల్లో అవినీతికి పాల్పడ్డారని, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించి అధికారులతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శి సామల సతీష్, కిసాన్ మోర్చా జిల్లా నాయకుడు కుర్మ మల్లారెడ్డి, కోశాధికారి తోకల శంకర్, బీజేవైఎం పట్టణ ఉపాధ్యక్షుడు సుమన్, ఎల్లాగౌడ్, రాహుల్, నరేష్, ఆర్మూర్, శంకర్ పాల్గొన్నారు.

ఐదుగురి సభ్యులతో ఉత్సవ కమిటీ ఏర్పాటు

బీర్‌పూర్, ఫిబ్రవరి 8: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా ఐదుగురి సభ్యులతో ఉత్సవ కమిటీని నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ నెల 19 నుంచి మార్చి నెల 2వరకు అత్యంత వైభవంగా జరిగే జాతర బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఉత్సవ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారి చేశారు. ఈ కమిటీలో ఆలయ చైర్మన్‌గా ఎనగంటి స్వామాట్, కమిటీ మెంబర్లు కొల్లూరి మల్లేశం, బదినపెల్లి కాంత, గాజుల భూమయ్య, గుర్రం శ్రీనివాస్‌లను కమిటీ సభ్యులుగా నియమిస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్ కరీంనగర్ వి.అనీల్ కుమార్ ఉత్తర్వులు జారిచేశారు. ఈ సందర్భంగా తమ ఎన్నికకు కృషి చేసిన ఎమ్మెల్సీ టీ. జీవన్‌రెడ్డికి, ఎంపీపీ మసర్తి రమేష్‌కు, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, వైస్ ఎంపీపీ లక్ష్మన్ రావ్‌లతో పాటు అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

కోరుట్ల రూరల్, ఫిబ్రవరి 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖలు చేసిన చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం ఆధ్వర్యంలో దహనం చేశారు. మండలంలోని అయిలాపూర్ గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు మాజీ ఎమ్మెల్యే బల్క సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి గ్రామ ప్రదాన కూడలిలో దహనం చేశారు. నాయకులు మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డిపై బల్క సుమన్ అనుచిత వాఖ్యలను వెన్నకి తీసుకోని బహిరంగంగా క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలకు పాలుపడే బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ పార్టీ వదిలి పెట్టదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పన్నాల అంజిరెడ్డి, చింతకుంట సంజీవ్ రెడ్డి, ఏలేటి పుల్లారెడ్డి, తాటికొండ బాబు, ద్యామనపల్లి రామకృష్ణ, గుగిళ్ల స్వామి, మారంపల్లి రాములు, ముక్కెర రాజేష్, సుమన్, హన్మక్క, విజయ్, రాజు, ఎలైజర్, అంజయ్య, రాములు, శివ, మధు, రాకేష్, శివ, నవీన్, లక్ష్మణ్, మల్లేష్, అశయ్యలతో పాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణలకు పాల్పడితే చర్యలు

సీఐ లక్ష్మినారాయణ, తహసీల్దార్ శేఖర్

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి 8 : గ్రామాల్లో సామాజిక, గ్రామ బహిష్కరణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి సీఐ లక్ష్మినారాయణ, తహసీల్దార్ శేఖర్ హెచ్చరించారు. గురువారం మండలం లోని ఆత్మకూర్ గ్రామాభివృద్ధి కమిటీ, గ్రామంలోని గౌడ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల గ్రామంలోని గౌడ గీత పారిశ్రామిక సహకార సంఘం సభ్యులను సామాజిక బహిష్కరణ చేసినట్లు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై వారు మూడు రోజుల క్రితం ఫిర్యాదు చేయడంతో ఇరువర్గాల సమ్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గౌడ గీతా పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఫొటోల కోసం ఘర్షణ.. యువకుడిపై దాడి

మల్యాల, ఫిబ్రవరి 8: పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం సందర్భంగా ఫొటోలు దిగే క్రమంలో చోటుచేసుకున్న యువకుల మధ్య జరిగిన ఘర్షన లో ఒకరికి గాయాలు అయినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్ర కారం.. మల్యాలలో బుధవారం కొన్నాళ్ల క్రితం పదవ తరగతి చదివిన విద్యార్థులు గెట్ టూగెదర్ కార్యక్రమం జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులు ఫొటోలు దిగు తుం డగా మల్యాలకు చెందిన వేముల రతన్, తునికి మహిపాల్ మధ్య ఘర్షన ఏర్పడింది. ఈ క్రమంలో మహిపాల్ పంచర్ చేసే పనిముట్టుతో రతన్‌పై దాడి చేయడంతో అతని గాయాలు అయ్యాయి. బాధితుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

మొరం..దళారులకు వరం..

- ●ఆగని అక్రమ రవాణా
- ●ఇష్టారాజ్యంగా గుట్టల తవ్వకాలు
- ●చోద్యం చూస్తున్న అధికారులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 8: గొల్లపల్లి మండలంలో మొరం దళారులకు వరంగా మారింది. జేసీబీలు, ఎక్స్‌కావేటర్ల సాయంతో గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వుతూ మొరం అక్రమంగా రవాణా చేస్తున్నారు. సెలవు దినాలతో పాటు రాత్రి వేళల్లో మొరం అక్రమంగా రవాణా చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. దీంతో గ్రామాల సహజ సంపదలైన గుట్టలు కనుమరుగు అవుతుండటమే కాకుండా పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

నిత్యం రోడ్లపై అధిక బరువులతో వాహనాల రాకపోకలు కొనసాగిస్తుండటంతో తారు రోడ్లు కంకర తేలి చెడిపోతున్నాయి. దీనిపై మైనింగ్, భూగర్భ గనులు, రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులు పట్టించుకో వడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు వెన్గుమట్ల, అబ్బా పూర్, చిల్వాకోడూర్, దట్నూర్, చెందోళి, ఆత్మకూర్, దమ్మన్నపేట, లక్ష్మీపూర్, రంగదాముని పల్లె, గోవిందుపల్లె, శ్రీరాముల పల్లె, బీబీరాజ్‌పల్లె, రాఘవ పట్నం, వెంగళాపూర్ తదితర గ్రామాల్లో మొరం దళారులకు వరంగా మారింది.

●ప్రభుత్వ ఆదాయానికి గండి

మొరం తరలించాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకుని రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులకు సమాచారమివ్వాల్సి ఉంటుంది. అయితే గొల్లపల్లి మండలంలో నిబంధనలకు తిలోదకాలిచ్చి అక్రమంగా మొరం తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొందరు వ్యక్తులు దళారుల అవతారమెత్తి ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో పట్టాదారులకు నామమాత్రంగా డబ్బులు ఇచ్చి సాగుకు అనుకూలం పేరిట గుట్టలను తవ్వుతూ సహజ సంపదలను కొల్లగొడుతున్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మొరం వ్యాపారం కొనసాగిస్తున్నారు.



గొల్లపల్లిలో ఎక్స్‌కావేటర్‌తో మొరం తవ్వుతున్న దృశ్యం

●కనుమరుగవుతున్న సహజ సంపద, వృక్ష సంపద

మండలంలో సహజ సంపదలైన గుట్టలు కాలగర్భంలో కలిసిపోతుండటంతో పాటు వృక్ష సంపద కనుమరుగవుతోంది. వన్య, అటవీ ప్రాణాలకు నివాసయోగ్యాలు కరువవుతున్నాయి. రాష్ట్రాన్ని హరితవనంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తూ తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా మొక్కలను నాటుతుంటే మరోపక్క మొరం మాఫియా నాటిన మొక్కలను, చెట్లను తొలగిస్తుండటంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది.

●ధ్వంసమవుతున్న రోడ్లు

పలు గ్రామాల్లో మొరంతో నిండిన ట్రాక్టర్లు, టిప్పర్లు రోడ్లపై రాకపోకలు కొనసాగిస్తుండటంతో కోట్లాది ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నాయి. తారు లేచిపోయి కంకర రోడ్లుగా మారుతున్నాయి. రోడ్లపై గుంతలు పడి ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని బీబీరాజ్‌పల్లె గ్రామంలో గ్రానైట్ రాయి, మొరం తీసుకువెళ్లే వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ ధ్వంసమై ప్రమాదభరితంగా మారాయి. గ్రామంలోని ఇళ్ల ముందు నుంచి నిత్యం భారీ వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుండటంతో ఇళ్లల్లోకి దుమ్ము, ధూళి చేరి అనారోగ్యాల పాలవుతున్నారు.

మొరం దందాపై ప్రత్యేక నిఘా

మహ్మద్ ఆరిఫొద్దీన్, తహసీల్దార్, గొల్లపల్లి



అనుమతులు లేకుండా సాగుతున్న మొరం దందాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అక్రమంగా మొరం రవాణా ఫిర్యాదులు అందితే వాహ నాలను సీజ్ చేస్తాం. అక్రమంగా మొరం వ్యాపారం చేస్తున్న దళారులపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. స్థానిక అవసరాల పేరిట గుట్టలు తవ్వుతూ మొరంను ఇతర ప్రాంతాలకు అక్రమంగా తర లించేవారి జాబితా రూపొందించి ఉన్నతాధికారులకు నివేదించి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

గ్రామాల్లో ముమ్మరంగా ప్రత్యేక పారిశుధ్య పనులు

కథలాపూర్, ఫిబ్రవరి 8 : ప్రభుత్వం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం ప్రత్యేక పారిశుధ్య నిర్వాహణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పట్టణాల నుంచి కూలీలను తెప్పించి మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను తొలగిస్తున్నారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి ట్రాక్టర్లతో చదును చేయించారు. శుక్రవారం డ్రైడే నిర్వహించడానికి చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో సిరిపురం జనార్ధన్ తెలిపారు. గ్రామాల ప్రత్యేక అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు ప్రత్యేక పారిశుధ్య పనులు పూర్తి చేస్తున్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాల పనులను నిర్వహించారు. గ్రా మాల్లోని పలు వీధులను ఊడ్చారు. రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్ల పొదలను తొలిగించారు. సానిటేషన్ పనులను నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను ఏరివేసి వీధులను శుభ్రం చేశారు. ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పద్మ జరాణి, తహసీల్దార్ రవికాంత్, ఎంపీవో ప్రవీణ్, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : గ్రామాల స్వచ్ఛతకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమ పనులు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలో స్పెషల్ డ్రైవ్ కింద రెండవ రోజు మాజీ సర్పంచు జరుపుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, అధి కారులు వీధులను శుభ్రం చేశారు. గ్రామాల్లో గుంతలుగా ఉన్న రోడ్లల్లో మట్టి నింపి, రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్టాండ్ తదితర పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ని పరిసరాలను శుభ్రంగా ఉంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవని, ప్రజలు ఇంటి తో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చిలివేరి విజయ్, డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌మహమ్మద్, కార్యదర్శి నిజా మొద్దిన్, పంచాయతీ సిబ్బంది, ఏఎన్ఎమ్ వసంత, ఆశా వర్కర్ హేమ, అంగన్ వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆత్మనగర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న అధికారులు, నాయకులు

పోసానిపేటలో ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్థలం గుర్తింపు

కథలాపూర్, ఫిబ్రవరి 8 : మండలంలోని పోసానిపేటలో ఇంటర్నేషనల్ స్కూల్ కోసం 10 ఎకరాల భూమి గుర్తించామని ఆర్ఐ నాగేశ్ చెప్పారు. ప్రభుత్వం ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్న నేపథ్యంలో సర్వేయర్‌తో కలిసి 412 బంచరాయి సర్వే నంబర్‌లో నిర్ణీత భూమి గుర్తించామని అన్నారు. ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 8: మండలంలోని యామపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎంపీటీసీ బోరిగం వివేకవర్ధిని-మహేష్‌లు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద సీసీ రోడ్ల నిర్మాణనికి 5లక్షలు మంజూరైనట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు పోనకంటి చిన్న వెంకట్, ఎంపీటీసీలు తిమ్మాని రాములు, అక్కెనపల్లి జలేష్,నాయకులు దేశెట్టి రాజరెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కోట మల్లేశం

పెగడపల్లి, ఫిబ్రవరి 8 : మండలంలోని నందగిరి పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా కోట మల్లేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల అధ్యక్షులు గాజుల గంగామల్లేశం సమక్షంలో నందగిరి సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కోట మల్లేశం, యూత్ అధ్యక్షులుగా పన్నాటి గంగాధర్‌లను ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. నూతన కమిటీని మండల అధ్యక్షుడు గంగామల్లేశం, మండల పరిషత్ వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్ అభినందించి సత్కరించారు.

భగవంతుని సేవతో మానసిక ప్రశాంతత

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 8 : ప్రతి నిత్యం వివిధ పనులతో, సమస్యలతో బిజీగా గపడే వారు భగవంతునికి కొంత సమయం సేవకు కేటాయిండంతో ఎంతో మానసిక సంతోషాన్ని ఇస్తుందని వైశ్య కుల గురువు హాల్దిపూర్ పీఠాధిపతి శ్రీవామనాశ్రమస్వామిజీ అన్నారు. గురువారం పట్టణంలోని వాసవి కనుకపరామేశ్వరి ఆలయాన్ని ఆయన సందర్శించి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతును సన్నిదానం ఎంతో పవిత్రమైందని, దానిని ప్రతి ఒక్కరు భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటే జీవితం సుఖమయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, కుల సంఘం నాయకులు, భక్తులు, పాల్గొన్నారు.

అమ్మవారికి లక్ష పుష్పార్చన

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పెద్ద ఎత్తున మహిళలు పుష్పార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వామనాశ్రమ మహా స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించారు.

అవిశ్వాస తీర్మానం ఉపసంహరించుకున్న కౌన్సిలర్లు

రాయికల్, ఫిబ్రవరి 8: రాయికల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఉపసం హరించుకున్నట్లు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గురువారం తెలిపారు. కౌన్సిలర్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ హామీ ఇవ్వడంతో అవిశ్వాస తీర్మానాన్ని ఉప సంహరించుకున్నట్లు పేర్కొన్నా రు. మేము చేసిన అభివృద్ధి పనుల బిల్లులు, వార్డుల అ భివృద్ధి, సమస్యల పరిష్కారం కోసమే తప్ప ఎలాంటి లా భాపేక్ష కోసం కాదని తెలిపారు.

కూలి డబ్బులు ఇవ్వాలని మహిళల వినతి

రాయికల్, ఫిబ్రవరి 8: హరితహారం కింద మొక్కలు నాటిన కూలి డబ్బులు ఇవ్వాలని కోరుతూ రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, కమిషనర్ సంతోష్ కుమార్‌లకు గురువారం మహిళలు వినతి పత్రం సమర్పించారు. 2021 నుంచి మూడు సంవత్సరాలుగా మున్సిపల్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని అన్నారు. వెంటనే డబ్బులు చెల్లించకుంటే మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధితులు ఒడ్డెర లక్ష్మి, బొడుసు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీరు మార్చుకోవాలి'

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 8 : పట్టణంలో పదవిని అడ్డం పెట్టుకొని బెదిరింపు లు, అవినీతి, దోపిడికి పాల్పడుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు తీరు మార్చుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్ హితవు పలికారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా గృహ నిర్మాణాలు చేపట్టుతున్న వారిని, వ్యాపార సముదాయాల కోసం నిర్మాణాలు చేస్తున్న వారి బిల్డింగులు సెట్ బ్యాక్ లేదని, అక్రమ వసుళ్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఈయన వెంటా పార్టీ నాయకులు పుల్లూరి వెంకటేష్, అరుణ్, రేవంత్, వసంత్ ఉన్నారు.

మంత్రి ఉత్తమ్ కుమార్‌ను కలిసిన కాంగ్రెస్ శ్రేణులు



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి కాంగ్రెస్ నాయకులు

కోరుట్ల, ఫిబ్రవరి 8 : రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు కలిసారు. హైదరాబాదులోని సచివాలయంలో మంత్రి చాంబర్‌లో ఉత్తమ్‌కుమార్‌ను కలిసి స్థానికంగా ఉన్నా పార్టీ పరిస్థితులను వివరించారు. నియోజకవర్గంలో మురికి కాల్వలు, సీసీ రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరి చేయగా మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, మరింత అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని ప్రణాళికను అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని నియోజకవర్గ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి మహేందర్ రెడ్డి, జెట్టి లింగం, అంజిరెడ్డి, సాయి రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమ్మేళనం

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 8 : మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు కోట కిషన్‌ల ఆత్మీయ సమ్మేళనం గురువారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని నూతనంగా ఎన్నికైనా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మైలారపు రాంబాబు, వివిధ సంఘాల పాలక వర్గాలను కోట సుమన్ వారిని శాలువలతో సన్మానించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా ఉంటే ఆర్యవైశ్యులు రాజకీయకంగా, వివిధ రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని ఆధుని కరణ చేయడానికి ఆర్యవైశ్యులు సహకారం అందించాలని కోరారు. కోట కిషన్ ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం కృషి చేసే వారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబాద్రి, దొంతుల రాజ్‌కుమార్, మహాజన్ నర్సింహులు, కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు

కోరుట్ల, ఫిబ్రవరి 8 : బీడీ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అయిందని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు, బీడి కార్మిక సంఘ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి సుతారి రాములు అన్నారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో బీడి కార్మిక సంఘ నాయకులు, కార్మికలతో సమావేశం నిర్వహిం చి మాట్లాడారు. బీడి పరిశ్రమపై అనేక అంక్షలను ప్రవేశ పెట్టి కార్పొరేట్ బహుళ జాత కంపెనీలైన సిగరెట్ కంపనీలకు అప్పజెప్పేలా కేంద్ర కుట్ర పనుతుందని ఆరోపించారు. బీడీ ప్యాక్టరీలో అకు బీడీ సరఫరా తంబాకు లాంటి పై జీఎస్‌టీ 28 శాతం విధించి కార్మికులు పొట్ట కొడుతున్నారని అన్నారు.

80 శాతం డేంజర్ గుర్తులను ముద్రించి బీడీ కంపెనీలను దెబ్బ కొట్టే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బీడీ కార్మక సంఘ నాయకులు సామల్ల మల్లేశం, ఎండి ముత్రం, కొక్కుల శాంత, కేవీ అనసూయ్య, బోగ గోవర్దన్, గోదావరి, శ్రీనివాస్, రంగారెడ్డి, బానుప్ర సాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మపురి బస్‌స్టేషన్ వద్ద ర్యాంపు ఏర్పాటు

ధర్మపురి, ఫిబ్రవరి 8: ధర్మపురి పట్టణం లోని బస్‌స్టేషన్ వద్ద మున్సిపల్ నిదులతో ర్యాంపు ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, ఆర్‌టీసీ ఇబ్బందులు తొలగించి నట్లు అయ్యింది. బస్టాండ్ లోకి వెళ్లే ప్రధాన దారిలో ర్యాంపు లేకపోవడంతో అంతా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలి నడకతో వెళ్లే ప్రయాణికులు కూడ కొన్ని సందర్భాల్లో కింద పడ్డారు. భారీ వర్షాలు కురిసినప్పుడు కూడా నీరు నిలిచి కష్టాలకు గురయ్యారు. దీంతో స్థానిక ఆటో యూనియన్ సభ్యులు తమ సమస్యను ఇటీవల ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్, పాలకవర్గ సభ్యులను ఆదేశించారు. మున్సిపల్ నిధులతో ర్యాంపు నిర్మించారు. సహకరించిన ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, కమీషనర్, పాలకవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీగా అర్వింద్ విజయానికి కృషి చేయాలి

బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్

కోరుట్ల, ఫిబ్రవరి 8 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను మరోమారు ఎంపీగా గెలిపించాలని బీజేపీ నాయకుడు రుద్ర శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని రాంనగర్ ప్రాతంలో పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటి అధ్యక్షతన బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మరోమారు బీజేపీ అభ్యర్థి అర్వింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అన్నారు. కొందరు సీనియర్ నాయకులు ఎంపీపై తప్పుడు ప్రచారం చేస్తూ పార్టీ పరువు తీస్తున్నారని, పార్టీ కార్యక్రమాలకు హజరు కానివారు కూడ పార్టీ గురించి మాట్లాడడం విచారకరమని అన్నారు.



మాట్లాడుతున్న రుద్ర శ్రీనివాస్

ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మ్యాడవేణి నరేష్, పెండం గణేష్ బీజేపీ నాయకులు కస్తూరి లక్ష్మినారాయణ, సుదవేణి మహేష్, చిరుమల్ల దనుంజయ్, పాల్గొన్నారు.

పీఎం నరేంద్ర మోదీతోనే అభివృద్ధి సాధ్యం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, ఫిబ్రవరి, 8 : దేశంలో అసాధారణ అభివృద్ధి చేసి ప్రపంచంలో భారతదేశం గౌరవాన్ని పెంచిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీదేనని, ఆయన వల్లే సాధ్యమందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో పార్టీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గావ్ చలో బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన పది ఏండ్లల్లో సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామంలో రెండు రోజులుగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల్లో బీజేపీ ప్రభు త్వం పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని పెంచిన గొప్ప నాయకుడని కొనియాడారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో పీఎం నరేంద్రమోడీ నేతృత్వంలో సాధించిన విజయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ మోర్చా మండలాధ్యక్షుడు బోగ గంగాధర్, నాయకులు ఇల్లేందుల శ్రీనివాస్, కొమ్ములపల్లి జలెందర్, బండి శంకర్, బత్తుల సంజీవ్, చుక్క సాగర్, మేడిచెల్మేడ రవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయికల్ : రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందరికీ అందే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని, పార్లమెంట్ ఎన్నికలే లక్ష్యంగా ప్రజలతో మమేకం కావాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అన్నవేణి వేణు, ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి రాజ శేఖర్, ఇటిక్యాల గ్రామ అధ్యక్షుడు సుంకిశాల సత్యం, పీఏసీఎస్ చైర్మన్ మహిప తి రెడ్డి, బూత్ అధ్యక్షుడు బయ్యని అంజి, సంజీవ రెడ్డి పాల్గొన్నారు.



జగ్గాసాగర్‌లోని రైతులకు కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు